ఇఫ్లూ వీసీగా ప్రొఫెసర్ నాగరాజు

ప్రొఫెసర్ నాగలపల్లి నాగరాజు

ఉస్మానియా యూనివర్సిటీ: ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ) నూతన వీసీగా ప్రొఫెసర్ నాగలపల్లి నాగరాజు నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర విద్యా శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఈ పదవిలో ఐదేళ్లు గానీ, ఆయనకు 70 ఏళ్ల వయసు వచ్చేవరకు గానీ (ఏది ముందైతే అది) ఉండనున్నారు. ఇంగ్లిష్ సాహిత్యం విభాగానికి చెందిన ఆయన ప్రస్తుతం ఒడిశాలోని గంగాధర్ మెహర్ యూనివర్సిటీ వీసీగా సేవలు అందిస్తున్నారు. ఆయన సుదీర్ఘకాలం సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కర్ణాటకలో అధ్యాపకుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. త్వరలో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఎంబీఏ కోర్సుల పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంబీఏ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ ఈవినింగ్, ఎంబీఏ టెక్నాలజీ మేనేజ్మెంట్ ఈవినింగ్ కోర్సుల సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్సైట్ www. osmania. ac. in లో చూసుకోవాలని సూచించారు.

నీటి దుబారా.. రూ.1000 జరిమానా

జూబ్లీహిల్స్, మార్చి 6: చుక్క చుక్క ఒడిసి పట్టు అని జలమండలి అధికారులు నీటి పొదుపును ప్రచారం చేస్తుంటే జనం తాగునీటిని దుబారా చేస్తున్నారు. గురువారం జలమండలి ఎండీ జూబ్లీహిల్స్ మీదుగా వాహనంలో వెళ్తుండగా ఓ వ్యక్తి పైప్‌తో తన ద్విచక్ర వాహనాన్ని కడుగుతున్నాడు. గమనించిన ఆయన జూబ్లీహిల్స్ అధికారులను పిలిచి జరిమానా విధించాలని ఆదేశించారు. అనంతరం వాహనదారుడు ఇలాంటి నీటి దుబారా మళ్లీ చేయనని చెప్పడంతో రూ. ఒక వెయ్యి ఫైన్‌తో సరి పెట్టారు. జూబ్లీహిల్స్ సెక్షన్ మేనేజర్ వెంకటేశ్ వాహనదారుడికి జరిమానా విధించారు.

అస్తవ్యస్తంగా వీధి దీపాల నిర్వహణ

- వీధి లైట్ల నిర్వహణను గాలికి వదిలి..
- అధికారుల పర్యవేక్షణ లోపంతో సమస్యలు తలెత్తుతున్నవైనం
- ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై సంబంధిత అధికారుల స్పందన కరువు

ముషీరాబాద్ మార్చి 6: ముషీరాబాద్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. గుత్తేదారు నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా గత కొన్ని నెలలుగా బస్తీలు, కాలనీలలో వీధి దీపాల నిర్వహణ గాడి తప్పింది. వీధి దీపాల నిర్వహణను కాంట్రాక్టు, సబ్ కాంట్రాక్టు తీసుకున్న వారు నిర్వహణను గాలికి వదిలేశారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు అధికారుల నుంచి స్పందన కరువైంది. స్థానిక ప్రజాప్రతినిధుల తో సంబంధిత అధికారులు, నిర్వహణ బాధ్యతలను చూస్తున్న కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు అంటిమట్టినట్టుగా వ్యవహరిస్తున్నారు. దాదాపు అన్ని మున్సిపాలి డివిజన్లో ఫిర్యాదులకు సైతం లెక్క లేకుండా పోయింది. ప్రధాన మార్గాల్లో సైతం వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. దీంతో బస్తీలు కాలనీలో ప్రధాన మార్గాల్లో అంధకారం అలుముకుంది. ప్రతియటా వీధి దీపాల నిర్వహణకు లక్షలు ఖర్చు పెడుతున్న బస్తీల్లో ఆశించిన స్థాయిలో వెలుగు పంచడం లేదు. నిర్వహణ లోపం, నాసిరకం పరికరాల ఏర్పాటుతో విదీపాల పరిధిలో నిర్వహణ ముచ్చటగా మారుతుంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా వీధి దీపాలు అలంకారప్రాయంగా మారుతున్నాయి. నియోజకవర్గంలో మొత్తం దాదాపు 1200 విధి దీపాలు, 200 మినీ హైమాస్ట్, 15 హైమాస్ట్ వీధి దీపాలు ఉన్నాయి. వీటిలో వీటిలో దాదాపు సగం వరకు పనిచేయడం లేదని ఆయా కాలనీల వాసులు పేర్కొంటున్నారు. సాయంత్రం ఆరు గంటలకు ఆటో మెటిగా పని చేయాల్సిన టైమర్లు పని చేయకపోవడంతో దీపాలు వెలగడం లేదు. ఒక్కో టైమర్ పరిధిలో విద్యుత్ వినియోగ కెపాసిటీని బట్టి 15 నుంచి 20 వరకు విధి దీపాలు కొనసాగుతుంటాయి. ఇవి కాకుండా మాన్యువల్‌గా మిగతావి కొనసాగుతున్నాయి. బస్తీలు, కాలనీలలో వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రి వేళల్లో మహిళలు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి

కొత్తపల్లి శకుంతలా దేవి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తలసాని

అమీర్‌పేట్, మార్చి 6: శతాధిక వృద్ధురాలి మృతికి మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌సంతాపం తెలిపారు. అమీర్ పేటకు చెందిన వ్యాపార వేత్త, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కొత్తపల్లి మధుసూదన్ రావు మాతృమూర్తి శకుంతలా దేవి (100) గురువారం మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అమీర్‌పేట్ రిలయన్స్ వీధిలోని వారి నివాసానికి వెళ్లి శకుంతలాదేవి పార్థివదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కొత్తపల్లి మధుసూదన్‌రావు కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే వెంట నివాళులర్పించిన వారిలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు హన్మంతరావు, నాయకులు అశోక్ యాదవ్, ప్రవీణ్ రెడ్డి, గోపిలాల్ చౌహాన్, కూతురు నర్సింహా, సర్దార్ కుల్వంత్ సింగ్, బలరాం తదితరులు ఉన్నారు.

ఆలయం పునర్నిర్మాణ పనులు ప్రారంభం

బేగంపేట్, మార్చి 6: రాంగోపాల్ డివిజన్ నల్లగుట్టలోని సీలైన్‌లో ముత్యాలమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులను మాజీమంత్రి సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రారంభించారు. గురువారం పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అత్తిలి అరుణ, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు కిషోర్‌కుమార్, ఆంజనేయులు, అరుణ్‌భట్, సత్యనారాయణ, బస్తీవాసులు శ్రీనివాస్, నర్సింగ్‌రావు, రాజేందర్, రాకేష్, కళ్యాణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తకు పరామర్శ

వసీంను పరామర్శిస్తున్న మెట్టుగూడ ఇన్‌చార్జి కిషోర్, కార్పొరేటర్ సునీత

అడ్డగుట్ట, మార్చి 6: అనారోగ్యంతో బాధ పడుతున్న మెట్టుగూడ డివిజన్ బీఆర్ఎస్ కార్యకర్త వసీంను గురువారం డివిజన్ ఇంచార్జ్ కిషోర్ కుమార్ , స్థానిక కార్పొరేటర్ సునీతలు పరామర్శించారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు వసీంను పరామర్శించి వారి కుటుంబానికి బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పడం జరిగిందని కిషోర్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా వసీం కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసినట్లు నాయకుడు కిషోర్ తెలియజేశారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి

చిక్కడపల్లి, మార్చి 6: ఉద్యమ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి డిమాండ్ చేశారు. జేఏసీ ఆధ్వర్యంలో ది గ్రేట్ తెలంగాణ మిలియన్ మార్చ్ డే సందర్భంగా గురువారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉద్యమ జర్నలిస్టుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. జేఏసీ చైర్మన్, సీనియర్ జర్నలిస్ట్ షోయబ్ ఉల్లాఖాన్, జేఏసీ సెక్రటరీ జనరల్ ప్రపుల్ రాంరెడ్డి మాట్లాడారు. రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక భూమిక పోషించిన జర్నలిస్టుల సమస్యలను సర్కార్ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లాఠీలు, తూటాలను లెక్క చేయకుండా ఉద్యమ ఘట్టాలను జర్నలిస్టులు కవర్ చేశారాన్నారు. మార్చి 10న నిర్వహిస్తున్న మిలియన్ మార్చ్‌ను జయప్రదంచేయాలని పిలుపునిచ్చారు. ట్యాంక్‌బండ్ అమర జ్యోతి నుంచి గన్‌పార్క్ వరకు భారీ ర్యాలీ అనంతరం బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జేఏసీ నాయకుడు రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో నేతలు లక్ష్మికాంతం, చర్చల చంద్రన్న ప్రసాద్, డోలక్ యాదగిరి, పెద్ద యాదగిరి, అంజలి, జర్నలిస్టులు, శ్రీనివాస్, నర్సిం హ, అఖిలేష్, గణేష్, ఎం.కిరణ్, పి.కరుణాకర్, సత్యం, శేఖర్, అనిల్, శ్రీధర్, మహబూబ్, రహీమ్, విజయ్, సైదులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ పుల్లయ్యకు లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు

పుల్లయ్యను సన్మానిస్తున్న గంగపుత్ర స్థానిక సంఘం నాయకులు

సికింద్రాబాద్, మార్చి 6: ప్రొఫెసర్ ఏపూరి పుల్లయ్యకు ఆలిండియా రిటైర్డ్ లెక్చరర్స్ అసోసియేషన్ వారు లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పుల్లయ్యను గంగపుత్ర స్థానిక సంఘం నాయకులు సన్మానించారు. పుల్లయ్య సేవలకు ప్రత్యేకించి గంగపుత్రులకు అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక సంఘం అధ్యక్షుడు డాక్టర్ దేశ బోయిన రఘు, గౌరవ అధ్యక్షుడు కర్మకొండ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పూస రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు వంగల సుధాకర్, ప్రచార కార్యదర్శి ముద్రగడ శివప్రసాద్, ప్రచార కార్యదర్శి కర్మ కొండ విశాల్, గంగపుత్ర సొసైటీ అధ్యక్షుడు కట్కూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాన్‌షాప్ వ్యాపారిపై దాడి

ఖైరతాబాద్, మార్చి 6: పని విషయంలో తరచూ మందలిస్తున్నాడని పాన్‌షాప్ వ్యాపారిపై ఓ వ్యక్తి కత్తితో దాడి చేశాడు. బండ్లగూడ నూరీనగర్‌కు చెందిన సయ్యద్ అతీక్ ఖైరతాబాద్‌లోని విఘ్నేశ్ విరాట్ ఫుడ్ కోర్టు వద్ద పాన్ షాప్ నిర్వహిస్తున్నాడు. స్థానికంగా పనిచేసే నసీమ్ అక్తర్.. సిగరేట్ కోసం పాన్‌షాపుకు వచ్చాడు. ఆ సమయంలో అతని వెంట కత్తి ఉండగా.. దానిని ఎందుకు తెచ్చావు అని అడుగుతుండగానే అతీక్‌పై దాడికి దిగాడు. అడ్డుకునేందుకు బాధితుడి సోదరుడు జావిద్ హుస్సేన్ ప్రయత్నించగా, అతనిపై కూడా దాడి చేశారు. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

సైన్స్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్‌గా శ్రీనివాస్‌నాయక్

డాక్టర్ శ్రీనివాస్‌నాయక్‌కు నియామక పత్రం అందజేస్తున్న ఓయూ వీసీ

ఉస్మానియా యూనివర్సిటీ: సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా కె.శ్రీనివాస్‌నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ఆయనకు ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్ నియామక పత్రాన్ని అందజేశారు. సెంటర్ ఫర్ ప్లాంట్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీపీఎంబీ)లో ఆయన ప్రస్తుతం అసోసియేట్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ నాయక్‌ను పలువురు అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు.

డిప్యూటీ కమిషనర్‌ను కలిసిన బీఆర్ఎస్ నేతలు

రామానుజులరెడ్డిని కలిసిన శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నేతలు

ముషీరాబాద్ మార్చి 6: జీహెచ్ఎంసీ సర్కిల్-15 డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రామానుజుల రెడ్డిని బీఆర్ఎస్ పార్టీ నేతలు కలిశారు. గురువారం సర్కిల్ కార్యాలయంలో రామానుజుల రెడ్డిని బీఆర్ఎస్ నేతలు కొండపల్లి మాధవ్, శ్యామ్ సుందర్, ఎర్రం శ్రీనివాస్ గుప్తా కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు.

విద్వేష పూరిత చర్యలను ఖండిద్దాం

సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ నాయకులు

కవాడిగూడ, మార్చి 6: దేశంలో అనేక ప్రాంతాల్లో మతతత్వ విద్వేష పూరిత చర్యలు సర్వసాధారణం అవుతున్నాయని, వాటిని ఖండించాల్సిన అవసరం ప్రతి పౌరుడిపై ఉందని ఆమ్ ఆద్మీ పార్టీ మైనారిటీ విభాగం రాష్ట్ర నాయకులు ఆష్జల్ సలీం అన్నారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా మార్చి 8న ఆప్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దోమలగూడ రాష్ట్ర కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ మత సామరస్యాన్ని బలోపేతం చేయడం కోసం ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. సమావేశంలో ఆప్ నాయకురాలు నర్సింగ్ యమున, డాక్టర్స్ విభాగం నాయకురాలు లక్ష్య, మైనారిటీ విభాగ నేతలు అజీమ్ బేగ్, షాబాజ్‌ఖాన్ పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వృద్ధురాలు అదృశ్యం

లక్ష్మీబాయి

ఉస్మానియా యూనివర్సిటీ: మతిస్థిమితం లేని వృద్ధురాలు అదృశ్యమైన ఘటన వారసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈస్ట్ పార్సిగుట్ట ఎంసీహెచ్‌కాలనీలో తాళ్ల రామేశ్వరరావు కుటుంబంతో సహా నివసిస్తున్నాడు. అతడి తల్లి లక్ష్మిబాయి (68) సంవత్సరం క్రితం బైక్‌పై నుంచి పడి తలకు తీవ్ర గాయం అవడంతో ఆసుపత్రిలో చికిత్స పొందింది. అప్పటినుంచి ఆమెకు మతిస్థిమితం సరిగా లేదు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి అందరూ తిన్న తర్వాత పదిన్నర గంటలకు పడుకున్నారు. అర్ధరాత్రి 12:30 గంటల సమయంలో లేచి చూడగా లక్ష్మిబాయి కనిపించలేదు. దీంతో వెంటనే సమీపంలో వెతకడంతోపాటు బంధువులు, సన్నిహితులను వాకబు చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో వారసిగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బోధనలో మెళకువలపై శిక్షణ

బన్సీలాల్ పేట్, మార్చి 6: నూతనంగా నియమితులైన సాంఘిక శాస్త్ర, తెలుగు భాషోపాధ్యాయులకు మూడు రోజుల పాటు జరిగిన ప్రేరణాత్మక శిక్షణా శిబిరం గురువారం ముగిసింది. బన్సీలాల్‌పేట్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ శిబిరాన్ని సికింద్రాబాద్ మండల ఉప విద్యాశాఖ అధికారి శ్రీధర్, జిల్లా క్వాలిటీ కో ఆర్డినేటర్ ఉమాదేవి, బన్సీలాల్ పేట్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వప్నమాల ప్రారంభించారు. ఉపాధ్యాయ వృత్తిలో ఆదర్శవంతంగా ఎలా ఉండాలి, నిబద్ధతతో ఎలా పని చేయాలి, విద్యా బోధనలో నూతన మెళకువలను ఎలా పాటించాలని, తరగతి గదిలో విద్యార్థులతో ఎలా ఉండాలి అని పలు అంశాలను వారు వివరించారు. సృజనాత్మకంగా, గుణాత్మకంగా, విద్యను అందించాలని, విద్యార్థుల మెదళ్ళలలో నాటుకుపోయేలా బోధనను అందించే మెళకువలను వారు వివరించారు. శ్రీనాధ శర్మ, బాలరాజు, లక్ష్మీపతి, నర్సింగ్ రావు, హిరణ్య, జయసుధ, విజయ్ కుమార్ లు రిసోర్స్ పర్సన్ లుగా వ్యవహరించారు. ఎంవీ ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ ఆర్.వెంకట్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని అన్నారు. నూతన ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

కవులు, కళాకారులకు కీర్తి పద్మాలు

నాట్య గురువు బి.వేదశ్రీకి కీర్తిపద్మం పురస్కారంతో సత్కరిస్తున్న నిర్వాహకులు

చిక్కడపల్లి, మార్చి 6: అఖిల భారతీయ పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 'చేనేత కళా వెలుగులు' శీర్షికన కవి సమ్మేళనం గురువారం నిర్వహించారు. కవులు తమ కవితల్ని వినిపించి ఆహూతుల్ని అలరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పలువురు కళాకారులకు, కవులకు కీర్తిపద్మాలు అందజేశారు. కూచిపూడి నాట్యంలో మాస్టర్స్ డిగ్రీ చేసిన నాట్య గురువు బి.వేదశ్రీకి కీర్తి పద్మం పురస్కారంతో సత్కరించారు. వేదశ్రీ కూచిపూడి నాట్యంలో మాస్టర్స్ డిగ్రీ చేసి అనేక నాట్య ప్రదర్శనలు చేశారు. హైదరాబాద్ కోటి దీపోత్సవం, వినాయక చవితి వంటి అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు 400కు పైగా కార్యక్రమాల్లో ఆమె నాట్య ప్రదర్శనలిచ్చారు. కార్యక్రమంలో అఖిల భారతీయ పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు తుమ్మా సత్యనారాయణ, ఎస్.రవికుమార్, జేబీ రాజు, అమృత్‌కుమార్ జైన్, రామకృష్ణ చంద్రమౌళి, సరోజినీదేవి, విభాభారతి తదితరులు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి అన్ని విధాలుగా చర్యలు

అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి, మార్చి 6: గాంధీనగర్ డివిజన్‌లో జీహెచ్ఎంసీ పార్కులను అభివృద్ధి, సుందరీకరణ చేయడానికి కృషి చెయ్యడం జరుగుతుందని స్థానిక కార్పొరేటర్ పావని అన్నారు. పార్క్‌ల అభివృద్ధి ప్రణాళికపై హార్టికల్చర్ అధికారులతో గురువారం కార్పొరేటర్ సమావేశం నిర్వహించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న పార్కుల అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో హార్టికల్చర్ మేనేజర్ ఆశిషికుమార్, ఎ.వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు 15 రోజుల రిమాండ్

ఖైరతాబాద్, మార్చి 6 : మద్యం సేవించి వాహనం నడిపి ఓ వ్యక్తిని ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు మందుబాబులకు నాంపల్లి కోర్టు 15 రోజుల రిమాండ్ విధించింది. పంజాగుట్ట పోలీసుల వివరాల ప్రకారం... నిమ్స్ దవాఖానలోని క్యాంటిన్‌లో చెఫ్‌గా పనిచేస్తున్న లింగయ్య విధులు ముగించు కొని ఆస్పత్రి వద్ద రోడ్డు దాటుతున్నాడు. ఖైరతాబాద్ నుంచి పంజాగుట్ట వైపునకు బైక్‌పై వస్తున్న బంజారాహిల్స్‌కు చెందిన లాలు ప్రసాద్ (25), సనత్‌నగర్‌కు చెందిన పవన్ కుమార్ (25)లు మద్యం మత్తులో లింగయ్యను ఢీకొట్టారు. పోలీసులు లాలు ప్రసాద్, పవన్ కుమార్‌ను అరెస్టుచేసి నాంపల్లి కోర్టులో హాజరు పర్చగా, 15 రోజుల రిమాండ్ విధించారు.

మద్యం మత్తులో మిత్రుల గొడవ.. ఒకరు మృతి

అడ్డగుట్ట, మార్చి 6: మద్యంమత్తులో స్నేహితుల మధ్య తలెత్తిన గొడవ ఒకరి మృతికి కారణమైంది. చిలకలగూడ సీఐ అనుదీప్ కథనం ప్రకారం.. సీతాఫల్‌మండికి చెందిన రేణుక, యాదగిరి దంపతుల కొడుకు నగేష్ (28)మహమ్మద్ గూడకు చెందిన నర్సింగ్, అడ్డగుట్టకు చెందిన సాయికిరణ్, శబరిస్ స్నేహితులు. వీరు బ్యాండ్ వ్యాయిద్యకారులు. ఈనెల 5న రాత్రి నలుగురు కలిసి పార్సిగుట్టలో మద్యం తాగారు. మత్తులో నగేష్, శబరిష్ మధ్య గొడవ తలెత్తింది. మాటామాట పెరగడంతో వారిని నర్సింగ్ సముదాయించాడు. అయినా ఎంతకీ వినకపోవడంతో కోపోద్రిక్తుడైన నర్సింగ్ పక్కనే ఉన్న కర్రతో నగేష్ తలపై బలంగా కొట్టాడు. దీంతో నగేష్ తల, ముక్కు భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్నేహితులు చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కొద్దిసేపటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. విషయం తెలుసుకున్న స్నేహితులు అక్కడి నుంచి పరారయ్యారు. చిలకలగూడ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఒక కొడుకు ఉన్నట్లు తెలిసింది.

చిట్టీల బాధితులకు న్యాయం చేయాలి

బేగంపేట్, మార్చి 6: చిట్టీల పేరుతో ప్రజలను మోసం చేసిన పుల్లయ్య బాధితులకు న్యాయం చేయాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పోలీసు అధికారులను ఆదేశించారు. సనత్ నగర్ బీకేగూడలో నివసించే పుల్లయ్య కొన్నేండ్లుగా చిట్టీలు నడుపుతూ ఇటీవల పరారయ్యాడు. దీంతో చిట్టీలు కట్టిన సనత్‌నగర్, దాసారం బస్తీలకు చెందిన బాధితులు వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి సమస్యను చెప్పారు. స్పందించిన ఎమ్మెల్యే సనత్‌నగర్ పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. బాధితులంతా పేదలేనని, వీలైనంత త్వరగా బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బీఆర్ఎస్ నాయకులు కర్ణాకర్‌రెడ్డి, రాజేష్‌ముదిరాజ్, పీయూష్‌గుప్తా, ఆకుల రాజు, సాయి, కృష్ణమూర్తి, తిమ్మప్ప, దిలీప్, మల్లేష్ ఉన్నారు.

సెల్‌ఫోన్ స్నాచింగ్

బంజారాహిల్స్, మార్చి 6: రోడ్డు మీ ద నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తి చేతిలోంచి మొబైల్ ఫోన్ లాక్కున్న ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బిహార్ ప్రాంతానికి చెందిన సాగర్ కుమా ర్ చౌదరి బంజారాహిల్స్, గౌరీశంకర్ కా లనీలో నివాసం ఉంటూ ప్రైవేటు ఉద్యో గం చేస్తున్నాడు. ఈనెల 4న రాత్రి 11.30 గంటల ప్రాంతంలో రోడ్ నం. 11లోని సర్వీ హోటల్ వైపునుంచి ఇంటి కి ఫోన్ మాట్లాడుతూ వెళ్తున్నాడు. మిన ర్వా హోటల్‌వద్దకు రాగానే వెనకనుంచి యాక్టివాపై వచ్చిన ఇద్దరు ఆగంతకులు అతడి చేతిలోని సెల్‌ఫోన్‌లాక్కుని ఉడాయించారు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం
సీతారాంనగర్, సీతాఫల్‌మండి, సికింద్రాబాద్.

లీజు హక్కుల కొరకు టెండరు సహిత బహిరంగ వేలం

నోటీస్ నెం: 02/SRSD/2025, తేది: 07-03-2025

దేవాదాయ ధర్మాదాయ చట్టం, 30/1987లోని సెక్షన్ 82 క్రింద G.O.Ms.No. 888/2003 (ఎండోమెంట్స్-1) శాఖ, తేది: 08-08-2003 ప్రకారం జారీ చేయబడిన నియమాల ప్రకారం దిగువ ఐటం కొరకు లీజు హక్కుల కొరకు టెండరు సహిత బహిరంగ వేలం నిర్వహించబడుతుందని తెలియజేయడమైనది:

క్ర.సం.	హక్కు వివరణ	లీజు కాలం	టెండరు షెడ్యూల్ ధర	EMD రూ.
1.	డోర్ నెం. 12-10-587/95/5	01-03-2025 నుండి 28-02-2028 వరకు	1,000/-	30,000/-

1. ఆసక్తిగల వ్యక్తులు టెండరు షెడ్యూళ్లను ఐ.డి. రుజువు దాఖలు చేయుట ద్వారా **17-03-2025**న పొందవచ్చును. సీల్డ్ టెండర్లను **18-03-2025**న **మ॥ 2.30 గం. వరకు** సీల్డ్ టెండరు బాక్సులో వేయవలెను. **టెండరు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, SRI RAMALINGESWARA SWAMY DEVASTHANAM** పేరున డిమాండ్ డ్రాఫ్ట్ కలిగి ఉండవలెను.
2. బహిరంగ వేలంలో పాల్గొనుటకు ఆసక్తిగల వ్యక్తులు వేలం రోజున అనగా **18-03-2025**న టెంపుల్ కౌంటర్‌లో బయానా మొత్తంతోపాటు టెండరు షెడ్యూల్ ధరను చెల్లించాలి. బహిరంగ వేలం తరువాత సీల్డ్ టెండర్లు తెరువబడతాయి.
3. వేలం **18-03-2025**న **మ॥ 03.00 గంటలకు** నిర్వహించబడుతుంది.

సం/- సోమల ప్రకాష్ రావు, ఆలయ వ్యవస్థాపకులు — స్వామివారి సేవలో... — సం/- జి. శ్రీనివాసులు, కార్యనిర్వహణాధికారి